నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, సోమవారం 26 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


- యూరిన్ శాంపిల్స్‌తో దొరకనున్న స్మోకర్లు
- ఇతర మత్తు పదార్థాలు సేవించిన వారి గుట్టు రట్టు
- పోలీస్, ఎక్సైజ్ స్టేషన్ల వారీగా పరికరాల అందజేత
- త్వరలో అనుమానితులకు టెస్టులు షురూ
- ఇకనుంచి పకడ్బందీగా ఎన్‌డీపీఎస్ యాక్ట్





# గంజాయి కిక్.. ఏబాన్‌తో బుక్

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అధునాతన కిట్లు

**గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించి చాలా మంది విద్యార్థులు, యువకులు తమ జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. వరంగల్ నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి స్మోకింగ్ విచ్చలవిడిగా పెరిగిపోయింది. పోలీసులు ఎంత కట్టడి చేసినప్పటికీ ఆగడం లేదు. రోజుకు ఏదో ఒక చోట గంజాయి సేవించి పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం అధునాతన పద్ధతులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు మందుబాబులకు పరీక్షలు చేసినట్లుగానే ఇప్పుడు గంజాయి, మత్తు పదార్థాలు సేవించే వారిని కనిపెట్టేందుకు ఏబాన్ కిట్లు వచ్చేశాయి.** *- సుబేదారి, ఆగస్టు 25*



ఏబాన్ టెస్ట్ పరికరం



మత్తు పదార్థాలను పసిగట్టే శునకం

గంజాయితోపాటు 12 రకాల మత్తు పదార్థాలు సేవించిన వ్యక్తులు 'ఏబాన్'తో అడ్డంగా దొరికిపోతారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని యూరిన్ శాంపిల్స్‌తో ఈ మిషన్‌తో టెస్ట్ చేస్తారు. పాజిటివ్ సిగ్నల్ వస్తే నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల (ఎన్‌డీపీఎస్) చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటారు. గంజాయి స్మోక్ చేసిన వ్యక్తుల బాడీలో ఆరు నెలల వరకు వాటి నమూనాలు ఉంటాయని, ఇది ఏబాన్ పరికరంతో బయట పడుతుందని ఇటీవలె హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు.

**పోలీస్ స్టేషన్లకు చేరిన పరికరాలు..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు పది రోజుల క్రితం ఏబాన్ టెస్ట్ పరికరాలు వచ్చాయి. నగర పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు రెండు నుంచి 3, గ్రామీణ ప్రాంతాల్లోని వాటికి ఒకటి నుంచి రెండు, ఎక్సైజ్ స్టేషన్‌కు ఒకటి చొప్పున వీటిని అందజేశారు. ఈ టెస్టులు చేయడానికి ప్రతి పోలీస్ స్టేషన్ అధికారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే టెస్ట్ డ్రైవ్‌లు ప్రారంభించడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా గంజాయి, మత్తు పదార్థాల వాసన పసిగట్టడానికి కమిషనరేట్‌కు టీఎస్ న్యాబ్ నుంచి రెండు ప్రత్యేక డాగ్‌లు వచ్చాయి. ఈ టెస్ట్‌లతో గంజాయి స్మోకింగ్ నియంత్రణ చాలా వరకు తగ్గే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

### కొత్త టెస్ట్‌లతో కఠిన చర్యలు



గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఎన్‌డీపీఎస్ యాక్ట్‌ను పక్కందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకున్నాం. గంజాయి స్మోక్ చేసిన వారిని సులువుగా పట్టుకోవడానికి కొత్తగా ఏబాన్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కమిషనరేట్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లకు అందజేశాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను పసిగట్టడానికి రెండు డాగ్‌లు కూడా వచ్చాయి. ఏబాన్ టెస్ట్‌లు చేయడానికి ప్రతి పోలీస్ స్టేషన్ అధికారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఇది పూర్తయిన తర్వాత టెస్టులు నిర్వహించి, స్మోకింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– అంబర్ కిషోర్‌ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్

### బోనాల సందడి



జనగామ రూరల్ : సిద్దెంకిలో బీరప్పకు బోనం తీసుకెళ్తున్న యాదవులు



పరకాల : బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. ఏటా శ్రావణ మాసంలో పోచమ్మ తల్లితో పాటు ఇతర గ్రామదేవతలకు ప్రజలు బోనాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని పెట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి కోళ్లు, మేకలు, గొర్లను బలిచ్చారు. తమను చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. సామూహిక బోనాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 25

### • జల సవ్వడి..



ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతానికి ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. 50 అడుగుల పైనుంచి సవ్వడి చేస్తూ కిందకు దుంకుతున్న జలపాతం అందాలను చూస్తూ స్నేహితులు, కుటుంబసభ్యులతో వ్యూ పాయింట్ వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. పర్యాటకులతో జలపాతం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొన్నది. – వాజేడు, ఆగస్టు25



ములుగులోని గ్రీవెన్ సెల్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న రైతులు (ఫైల్)

# అన్నదాత అరిగోస

## రుణమాఫీ కాక.. సమాచారం తెలియక ఇబ్బందులు

- రోజుల తరబడి బ్యాంకులు, పీఏసీఎస్‌ల చుట్టూ ప్రదక్షిణలు
- వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పోటెత్తుతున్న రైతులు
- మరోసారి సమర్పిస్తున్న దరఖాస్తులు

**ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్నదాతలు అరిగోస పడుతున్నారు. రుణమాఫీ కాక.. సమాచారం తెలియక ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకోలేక.. అధికారుల చుట్టూ తిరగలేక నరకయాతన అనుభవిస్తున్నారు. అన్ని అర్హతలున్నా తమకు మాఫీ ఎందుకు వర్తించలేదని బ్యాంకులు, సొసైటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఆధార్ నంబర్ తప్పుగా ఉందని, పేర్లు సరిగా లేవని, రేషన్ కార్డు లేదనే సాకుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమ రుణాలను రెన్యువల్ చేసుకున్నా రికార్డులో నమోదు చేయకపోవడంతో మాఫీకి దూరమయ్యామంటూ ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులకు మరోసారి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి కనపడుతున్నది. ఊరిలో సగం మందికి కూడా రుణమాఫీ వర్తించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.** *- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 25*

### కొందరికేనా రుణమాఫీ?

**తమకు ఎందుకు కాలేదని ఆందోళనలో అన్నదాతలు**

నర్సింహులపేట, ఆగస్టు 25 : 'కొందరికేనా రుణమాఫీ.. మాకెందుకు కాలేదు' అని రైతులు ఆందోళన చెందుతున్నారు. నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామంలో సగం మందికి పైగా రుణమాఫీ కాలేదు. సుమారు 220 మంది ఎస్‌బీఐ, డీసీసీ, యూనియన్ బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్నారు. మూడు దఫాలుగా రుణమాఫీ చేసినా తమ పేర్లు లేవని, ఎందుకు కాలేదో ఎవరినడిగినా సమాధానం చెప్పడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ ఎందుకు కాలేదో తెలియడం లేదని, ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు.

### మా ఖాతాల డబ్బులు జమ చేయాలె



నేను, నా భార్య కలిసి చెరో రూ. లక్షా 10 వేల పంట రుణం తీసుకున్నం. ప్రభుత్వం ఇస్తామన్న రూ. 2 లక్షలు మా ఖాతాలో జమ చేస్తే బ్యాంకులో ఉన్న మిగిలిన పైసలకు కలుపుకుని మల్ల లోను తీసుకుంటం. ముందుగా రూ. 2 లక్షలకు పైన ఉన్న పైసలు కట్టమంటే ఎక్కడ నుంచి కట్టాలే. అప్పు తెచ్చి లోన్ కడితే ప్రభుత్వం మాఫీ చేయకపోతే అప్పుడు మా గోస ఎవరు తీరుస్తరు. మూడు రోజుల సంది రైతువేదిక వద్దకు ఇద్దరం వస్తున్నాం. ఎవ్వలు ఏమీ చెప్పడంలేదు. జర అధికారులు మా గోసను ప్రభుత్వానికి చెప్పుండ్రు.

– జాటోత్ సీత–స్వరూప, మంగళితండా

### • 152మందిలో ఐదుగురికే మాఫీ

**దూదేకులపల్లి రైతులకు తప్పని పాట్లు**



ఆజంనగర్ ఏపీజీవీబీలో రుణమాఫీ కాని దూదేకులపల్లి రైతులు

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 25(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రుణమాఫీ కాని రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. జిల్లాలో మొదటి విడత 14,079 మంది రైతులకు రూ. 82.25 కోట్లు, రెండో విడత 8851 మంది రైతులకు రూ.103.68 కోట్లు, మూడో విడత 6753 మంది రైతులకు రూ.113.40 కోట్ల రుణం మాఫీ అయింది. కాగా భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామంలో 152 మంది కాకతీయ గ్రామీణ వికాస్ బ్యాంకులో రుణం తీసుకోగా కేవలం ఐదుగురికి మాత్రమే రుణమాఫీ అయింది. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని చెప్పుకొనే ఈ ఊరిలో రైతులకు రుణమాఫీ జరుగకపోవడం చర్చనీయాంశమైంది. రైతులు బ్యాంకు అధికారులను సంప్రదించినప్పటికీ సరైన సమాధానం చెప్పకపోవడంతో వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. సర్కారుపై మండిపడుతూ రుణమాఫీ చేయకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు.

### మా ఇద్దరికి కాలే



మా ఊరిలో 152 మంది పంట రుణాలు తీసుకుంటే ఐదుగురికి మాత్రమే మాఫీ జరిగింది. నేను రూ.90వేలు, నా భార్య పేరున రూ.90 వేలు రుణం తీసుకున్నం. అవి వడ్డీతో రూ. 2లక్షల వరకు పెరిగింది. ఇద్దరిలో ఎవరికీ రుణమాఫీ కాలేదు.

– బిలుగు సమ్మయ్య, రైతు, దూదేకులపల్లి, భూపాలపల్లి

### వడ్డీ కట్టినా మాఫేది?



నేను భూపాలపల్లిలో ఆజంనగర్ బ్రాంచి ఏపీజీవీబీలో రూ. 70 వేలు రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి 1.60 లక్షలు అయ్యాయి. ఇదివరకే వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకున్నా. అయినా మాఫీ కాలేదు. రోజూ బ్యాంక్ చుట్టూ, అధికారులు చుట్టూ తిరుగుతున్నం.

– బానోత్ గోపి, దూదేకులపల్లి, భూపాలపల్లి జిల్లా

### ఎవరూ సమాధానం చెప్పడం లేదు..



నర్సంపేట : నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. ఐవోబీలో 2023లో రూ.70 వేల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. ఐవోబీ పరిధిలో ఉన్న రైతుల్లో ఒక వంతు మందికి కూడా రుణమాఫీ కాలేదు. అటు వ్యవసాయ అధికారులు, ఇటు బ్యాంకు అధికారులు ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో అయోమయానికి గురవుతున్నాం. ప్రభుత్వం రుణమాఫీ చేశామని ప్రచారం చేస్తున్నా, ఆచరణలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– కోరుకొండ శ్రీనివాస్, రైతు, అలంకానిపేట, నర్సంపేట

### బ్యాంకు ఓ చోట.. మాఫీ మరో చోట



దేవరుప్పుల : మాది రామరాజుపల్లి. సింగరాజుపల్లిలోని ఏపీజీవీబీలో నాకు రూ. 96 వేల అప్పు ఉంది. ఇక్కడే రెన్యువల్ చేస్తా. ఇప్పటికీ మాఫీ కాలే. వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారుల చుట్టూ తిరగని రోజులేదు. ఎవ్వలు సరిగ చెప్తలేరు. ఇగ లాభం లేదని బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తే నీ పేరు దుబ్బాక గ్రామంలోని ఏపీజీవీబీలో పడింది. అక్కడ బ్యాంకులో మాఫీ వచ్చిందన్నడు. నేను అప్పు తీసుకున్నది సింగరాజు పల్లి బ్యాంకులైతే దుబ్బాకతో నాకేం సంబంధం. ఇదేందని మేనేజర్‌ను అడిగితే వ్యవసాయ శాఖ వద్దకు పోతే బ్యాంకు వాళ్లే సరిచేస్తారని చెబుతున్నరు.

– కాల్వ మధు, రైతు, రామరాజుపల్లి, దేవరుప్పుల మండలం

### షరతులు పెట్టొద్దు

మహదేవపూర్ : నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను వ్యవసాయం కోసం మహదేవపూర్‌లోని డీసీసీ బ్యాంక్‌ల పంట రుణం తీసుకున్న. రూ.2 లక్షల పంట రుణమాఫీ లిస్ట్‌లో నా పేరు రాలేదంటాండ్రు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పి దాటవేస్తున్నరు. రైతులకు కనీస సమాచారం ఇచ్చే వారు లేక ఆఫీస్‌ల చుట్టూ తిరుగుడైతాంది. షరతులు లేకుండానే ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మాఫీ చేయాలి.

– అడప లక్ష్మీనారాయణ, రైతు, మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా



# పేరుకే ట్రాన్స్‌కో.. రిపేర్‌కు రైతులే..

- కరెంటు సమస్యలు వస్తే.. అధికారులు, సిబ్బంది నుంచి స్పందన కరువు
- స్వయంగా ప్రజలు, రైతులే మరమ్మతు చేసుకుంటున్న వైనం



రూప్లాతండా శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు వేస్తున్న రైతు

నర్సింహులపేట, ఆగస్టు 25 : గ్రామాల్లో కరెంట్ పోయినా.. విద్యుత్ వైరు తెగినా పట్టించుకునే వారే లేరు. మరమ్మతు చేసేందుకు గ్రామ హెల్పర్లు అందుబాటులో ఉండకపోవడంతో కరెంటుకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా ప్రజలు, రైతులే మరమ్మతు చేసుకోవాల్సిన దుస్థితి గ్రామాల్లో నెలకొన్నది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు పోవడంతో ఆదివారం కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విలేజ్ హెల్పర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించ లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న బీల్యాతండాకు చెందిన రైతు లకావత్ రవి మిరప తోట నాటు వేసేందుకు నీళ్లు అవసరం పడడంతో చేసేది లేక తానే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఫీజులు వేసుకొని తువాలతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేశాడు. ఏదైనా ప్రమాదం జరిగి రైతు కుటుంబం వీధిన పడితే కారణం ఎవరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కోసం పైసలు ఇవ్వనిదే ఎవరూ రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలేజ్ హెల్పర్‌పై చర్యలు తీసుకోవాలని కొమ్ములవంచ, రూప్లాతండా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

### తూనికలు, కొలతల శాఖలో అధికారుల సస్పెన్షన్?

పోచమ్మమైదాన్, ఆగస్టు 25: వరంగల్ కొత్తవాడలోని తూనికలు, కొలతల (లీగల్ అండ్ మెట్రాలజీ) శాఖ కార్యాలయంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీసర్‌గా పని చేస్తున్న ప్రవీణ్ సస్పెండ్ అయినట్లు తెలిసింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. అలాగే, హైదరాబాద్‌లో జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీసర్‌గా పని చేస్తున్న ప్రవీణ్ భార్య అనురాధ కూడా సస్పెండ్ అయినట్లు తెలుస్తున్నది. అయితే, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అలాగే, ఇందుకు సంబంధించిన ఆర్డర్లు కూడా జారీ చేయలేదని విశ్వసనీయ సమాచారం.



ఎడ్లబండిపై గణనాథుడు




ఊపితే పాట వచ్చే ఊయలలో వినాయకుడు

# వక్రతుండం.. తీరొక్క రూపం..

- ఎడ్లబండిపై ఊరేగే గణనాథుడు
- ఊయల ఊపితే పాటలు వచ్చే వినాయకుడు
- ఏటూరునాగారంలో రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు
- ఆంధ్రప్రదేశ్ నుంచి భారీగా ఆర్డర్లు
- రూ. 40 వేల నుంచి రూ. లక్ష వరకు పలుకుతున్న ధర

ఏటూరునాగారం, ఆగస్టు 25: ఎడ్లబండిపై గణనాథుడు, ఊయలలో గణపతి.. ఇలా తీరొక్క వినాయక విగ్రహాలకు డిమాండ్ పెరుగుతోంది. నవరాత్రి ఉత్సవాలకు భక్తులను ఆకట్టుకునేలా ఏటూరునాగారంలో సిల్వర్, గోల్డ్ కలర్స్‌తో వీటిని తయారుచేస్తున్నారు. వీటికి మార్కెట్‌లో మంచి క్రేజ్ ఉండడంతో ఏపీ నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన నాగభూషణరావు ఎడ్లబండిపై వినాయకుడి విగ్రహం తయారుచేస్తుండగా ఏపీలోని విజయవాడకు చెందిన ఎస్ రామారావు చూసి రూ. లక్షకు కొనుక్కున్నాడు. పచ్చని గడ్డి, ఎడ్లబండిపై వినాయకుడు వెళ్తుండేలా దీన్ని రూపొందించారు. రోడ్డు పక్కనే విగ్రహాలను తయారు చేస్తుండడంతో చాలా మంది ఆసక్తిగా తిలకిస్తున్నారు. మరో నాలుగు ఊయల ఊగే గణనాథుల విగ్రహాలను విజయవాడ ప్రాంతానికి చెందిన వారు బుకింగ్ చేసుకున్నారు. ఒక్కోదాని ధర రూ. 40 వేల నుంచి రూ. లక్ష దాకా ఉన్నాయి.



ఏటూరునాగారంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

### రూ. లక్షకు అమ్ముడుపోయింది



ఎడ్లబండిపై వినాయకుడి విగ్రహం రూ. లక్షకు అమ్ముడుపోయింది. దీనిని గుంటూరు జిల్లాలో నవరాత్రుల కోసం ప్రతిష్ఠించేందుకు తీసుకున్నారు. ఇక మరో నాలుగు ఊయలలో గణనాథుల విగ్రహాలను కూడా విజయవాడ వారే బుక్ చేసుకున్నారు. ఊయలను ఊపితే పాట వచ్చేలా తయారు చేశాం.

– నాగభూషణరావు, తయారీ దారుడు

# బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- గ్రామ స్థాయి నుంచే బలోపేతం చేయాలి
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి
- ఓరుగల్లు కేంద్రంగా బీసీ ఉద్యమం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



మాట్లాడుతున్న బండా ప్రకాశ్

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 25 : రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం బీసీలంతా ఏకతాటిపైకి రావాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ఆదివారం కాజీపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ కన్వీనర్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అధ్యక్షతన బీసీల సమర శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం కావాలంటే బీసీ జనగణన ఒక్కటే పరిష్కార మార్గామని సూచించారు. బీసీ కులాలన్నీ రిజర్వేషన్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీపీ మండల్ మనమడు సూరజ్ మండల్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వారికి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను సాధించాలంటే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బీసీ సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ సాకారం కోసం బీసీలందరం కొట్లాడుదామన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఓరుగల్లు కేంద్రంగా బీసీ ఉద్యమం మొదలైందని, దీన్ని ఉధృతం చేస్తామన్నారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా బీసీ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో కొన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ చట్ట సవరణ ద్వారా సాధించుకోవచ్చని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి పేర్కొన్నారు. బీసీల కోసం బీపీ మండల్, కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ పాత్రను మరువలేమని వినయ్ కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సమ్మయ్య, రాజయ్య యాదవ్, సతీశ్, క్రాంతి కుమార్, ప్రొఫెసర్లు భాస్కర్, విజయబాబు, దారం జనార్దన్, కృష్ణ బెనర్జీ, వేణు మాధవ్ గౌడ్, పులి రజినీ కాంత్, నరెడ్ల శ్రీధర్, రఘు, గుర్రపు రవీందర్ గౌడ్, గొల్లపల్లి వీరస్వామి, గోలి సుధాకర్, బుద్ధ వెంకన్న, కనక రాజు, మాచర్ల శరత్, పొలపల్లి రామ్మూర్తి, నలబాల రవికుమార్, కృష్ణాగౌడ్, ప్రవీణ్, రఘు పాల్గొన్నారు.